Title: **POTTER'S HOUSE**
Preached by Dr. W euGENE SCOTT, PhD., Stanford University
At the Los Angeles University Cathedral
Copyright © 2007, Pastor Melissa Scott. - all rights reserved
శీర్షిక :- **కుమ్మరి వాని ఇల్లు**
ప్రసంగీకులు : డా॥ డబ్ల్యూ. ఇయు జేన్ స్కాట్. పి.హెచ్‌డి, స్టాన్ పోర్డ్ యూనివర్సిటి
లాస్ ఏంజల్స్ యూనివర్సిటి కెతెడ్రల్
కాపీ రైట్ © 2007, పాస్టర్ మెలీసా స్కాట్ - సర్వ హక్కులు మావి.

# POTTER'S HOUSE
## కుమ్మరి వాని ఇల్లు

నేను తయారు చేసుకొన్న ప్రసంగమును ఈ రోజు బోధించుట లేదు. దేవుడు నన్ను నడిపించిన ప్రకారం దేవుని ఆజ్ఞకు లోబడి గతంలో నేను చెప్పిన రీతిగ తిరిగి యిర్మీయా 18వ అధ్యాయం గురించి బోధిస్తాను.

"యెహోవా యొద్దనుండి యిర్మీయాకు ప్రత్యక్షమైన వాక్కు నీవు లేచి కుమ్మరి వాని ఇంటికి పొమ్ము, అక్కడ నా మాట నీకు తెలియజేతును. నేను కుమ్మరి ఇంటికి వెళ్లగా వాడు తన సారె మీద పని చేయుచుండెను". నా బైబిలు పుస్తకాలన్నిటిలో జి.కాంప్‌బెల్ మోర్గాన్ అనువాదాన్ని మార్జినులో ఒక ప్రక్క స్థలంలో వ్రాసికొన్నాను. తన సారె మీద ఆయన పని చేయుచుండెను అని వ్రాసికొన్నాను.

"కుమ్మరి జిగట మంటితో చేయుచున్న కుండ వాని చేతిలో నుండి విరిగి పోగా ఆ జిగట మన్నును మరలా తీసికొని తనకు ఇష్టమైనట్లుగా ఆ జిగట మట్టితో మరియొక కుండ చేసెను". మోర్గాన్ అనువాదం ప్రకారం చూస్తె ఆయన చేస్తున్న పాత్ర ఏదో ఇష్టానుసారంగా చేయునటు వంటి పాత్రకాదని, అది ఒక ఉద్దేశంతో, ఒక ప్రణాళిక ప్రకారం, ఒక పద్ధతిలో చేయబడుచున్నది. అని తెలియుచున్నది. కుమ్మరి జిగటమంటితో చేయుచున్న పాత్ర వాని చేతిలో విరిగి పోగ, ఆ జిగట మన్నును మరల తీసికొని కుమ్మరి తనకు ఇష్టమైనట్లుగా ముందు అనుకొన్న రీతిగ మరియొక పాత్రను చేసెను.

ఆరవ వచనం, దేవునికి మనిషికి మధ్యనున్న సంబంధం గురించి చెబుతుంది. "ఇశ్రాయేలు వారలారా, ఈ కుమ్మరి మట్టిని చేసినట్లు నేను మీకు చేయలేనా? ఇదే యెహోవా వాక్కు - జిగట మన్ను కుమ్మరి చేతిలో ఉన్నట్లుగా ఇశ్రాయేలీయు వారలారా, మీరు నా చేతిలో ఉన్నారు".

నేను ఈ అధ్యాయాన్ని (అనగా యిర్మీయా 18) వందసార్లు బోధించాను. కాని దేవుని విషయమైన ఇతర సత్యాలవలె మీరు దీనిని బాగుగా అర్థం చేసికోవలసి వున్నది. 1727వ సంవత్సరంలో 75 మంది జర్మను క్రైస్తవులు దేవుని ప్రార్దిస్తు కనిపెట్టుకొని యున్నప్పుడు పరిశుద్ధాత్మ వారి మీద క్రుమ్మరింపబడెను. అప్పటి నుండి మొరోవియన్ ఉద్యమం మొదలు అయినది. 200 సంవత్సరాలలో చర్చి చేసిన దేవుని సరిచర్య కంటె, కొద్ది కాలంలోనే 75 మంది జర్మను క్రైస్తవులు చేసిన దేవుని పరిచర్య చాలా గొప్పది. కౌంట్ జిన్ జిన్ డోర్ఫ్ గూడ వారి యొక్క పరిచర్య గురించి వ్రాశారు. ఈ 75 మంది జీవితాలు చార్లెస్, మరియు జాన్‌వెస్లీల జీవితాల్ని ప్రభావితం చేసాయి. చార్లెసుకు ప్రభువు నందు లోతైన అనుభవం కలదు. జాన్‌వెస్లీ ఒక మంచి ఆంగ్లికన్ చర్చిలో బోధకుడు. వీరివురు అట్లాంటిక్ లో ఒక ఓడలో ప్రయాణం చేస్తున్నారు. ఆ సమయంలో భయంకరమైన తుఫాను వచ్చి ప్రయాణీకులు, నావికులు అందరు భయభ్రాంతులయ్యారు. ఆ ఓడలో భయపడకుండ ధైర్యంగ వున్నది, అందులో వున్న కొద్దిమంది మొరావియన్ క్రైస్తవులు మాత్రమె. జాన్ వారి దగ్గరకు వెళ్ళిచూడగా వారు ప్రార్థించకుండా, పాటలు పాడుచు ఉన్నారు. జాన్ వారిని మీరెందుకు ప్రార్ధించుట లేదని ప్రశ్నించినపుడు, వారు మేము ఈ తుఫానులో జల సమాధి అగుట దేవుని చిత్తమయితె మాకు వెంటనే దేవుని పరిశుద్ధతలో ప్రవేశం దొరుకుతుంది. మాకు కావలసినది కూడ అదె అని జవాబిచ్చారు. జాన్ మొరావియన్ నాయకునితో మీరు, చార్లెస్ దేవుని దగ్గర నుండి ఏదో పొందినారు, అదేదో నాకు కూడ చెప్పండి అని అడిగినప్పుడు మొరావియన్ నాయకుడు మా దగ్గర వున్నది "దేవుని కృప" అని జవాబునిచ్చెను.

నేను వయసునందు, దేవుని సేవయందు పెరుగు కొలది దేవుడు నా యందు దయ తలచి వాక్యమందలి నిగూఢమైన అర్ధాలు నాకు తెలియ చేయుచున్నాడు. నేను ఎన్నో విషయాలు వాక్యం ద్వార బోధించి యున్నాను. కాని నాకు ఇప్పుడు అర్ధం అవుతుంది. నేను వాటిని పూర్తిగా అర్ధం చేసికోలేదని, పైపైన మాత్రమే అర్ధం చేసికో గలిగేనని, దేవుని తో జీవించినపుడు,నీవు దేవునితో అంటుకట్టబడి దేవుడు నీకు సత్యాన్ని తెలియ చేసినప్పుడు ఆ సత్యం నీలో నుండి వస్తే తప్ప నీవు దానిని అర్ధం చేసికొన లేవు.

మనం ఎన్నో వాక్యాలు వందల సార్లు చదివి వుంటాము. కాని వాటి అర్ధం మనకి పూర్తిగా బోధపడదు. అవి కార్ల్ బార్త్ గారు చెప్పినట్లు అనుకొనిన రీతిలో ఒక మృగము అకస్మాత్తుగా దూకి మనలను పట్టుకొనునట్లు, పట్టుకొనును. మన జీవన పయనంలో అకస్మాత్తుగా ఆ వాక్యాలకు భావం స్ఫురించి మనం వెళ్ళవలసిన మార్గాన్ని మనకు చూపిస్తుంది. నేను ఇదివరలో ఎన్నో సార్లు కుమ్మరి వాని గృహం గురించి బోధించాను గాని, దేవుడు నాకు దానిలో నుండి క్రొత్త సత్యాన్ని బోధించాడు. నేను ఆ సత్యాన్ని మీకు బోధించినప్పుడు మీరు బాగ అర్ధం చేసుకొంటారని భావిస్తున్నాను. మీకు తెలిసినట్లు "సెర్మన్"అని పదం'సెర్మే' అనే లాటిన్ పదం నుండి వచ్చింది. యోహాను సువార్తలో "ఆది యందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడైయుండెను".తో ఆరంభం అవుతుంది.ఈ రోజు మీరు నేను బోధించే ఈ వాక్యంలో నా స్వరం కాకుండా దేవుని స్వరం వింటారని నమ్ముతున్నాను.

మీ ధ్యాస వేరే ఇతర విషయాల మీద ఉంచకుండ, పూర్తిగా దేవుని వైపు మళ్ళిస్తే, ఆయన ఈ రోజు మన అందరితో మాట్లాడగలడు. ఈ రోజుల్లో ప్రసంగాలు చాల ఎక్కువగా వింటూన్నాము. ఎటు చూసినా ప్రసంగీకులే. వాటి ఫలితం విత్తు వాని ఉపమానంలో లాగ గట్టి నేలన పడిన విత్తనాలు లాగ మొలచి వెంటనే వేరు సరిగ్గా లేకపోయినందున ఎండి పోతున్నవి. ఒక ప్రసంగం తర్వాత మరియొక ప్రసంగం వింటున్నాము. ఏది కూడ పూర్తిగా మన మనసు లోతుల్ని తాకటం లేదు.

ఎప్పుడయితే దేవుని వాక్యం, పరిశుద్ధాత్మతో నింపబడి వుంటుందో, అటువంటి వాక్యం మన హృదయం లోనికిదూసుకొని వెళ్తుంది. పేతురు పెంతుకోస్తు పండుగ దినమున బోధించినప్పుడు జనసమూహం విని, హృదయములో నొచ్చుకొని, రక్షింపబడుటకు మేమేమి చేయవలెనని అడిగిరి.. యిర్మియా పద్దెనిమిదవ అధ్యాయం మార్జినులో(Principle, Purpose, Process, Person) ప్రధాన సూత్రం,ఉద్దేశం, పద్ధతి, వ్యక్తి, అనే నాలుగు మాటలు వ్రాసుకొనండి. దేవుడు తను ఉపయోగించ దలచుకొన్నా బలమైన వ్యక్తులను, కుమ్మరి వాని సారె మీద పాఠములు నేర్చుకొనేటట్లు చేస్తున్నాడు. దేవుడు తన ప్రజలతో, తన బిడ్డలతో ఈ విధంగా ప్రవర్తిస్తాడు అని వారికి అర్ధమయ్యేటట్లు చేస్తున్నాడు.

మానవులలో యిర్మియా కంటే ఆత్మీయంగా, మానసికంగా దేవుని యందు దారుఢ్యము గల వ్యక్తిని మనము చూడము. యిర్మియా ఏ తప్పు చేయలేదు. దేవుని వాక్యం బోధించినందుకు యిర్మియా బురద గుంటలో వేయబడ్డాడు. బురదలో కూరుకొని పోతు మరణం తథ్యమని తెలిసినా దేవుని యందు అతని విశ్వాసం ఏ మాత్రము తగ్గలేదు. ఎటువంటి క్లిష్ట పరిస్తితులలో నైనా దేవుడే చూసుకొంటాడు అనే గొప్ప నమ్మకంతో, ఆయన మీద పూర్తి బారం వేసి వున్నాడు. ఇశ్రాయేలీయులు చెరనుండి విడిపించ బడినప్పుడు దేవాలయము కట్టుటకు జకర్యా ఎంతో కష్టపడెను. అందరు ఎంతో నిరుత్సాహ పడి, ఇక పని చేయలేము అన్నప్పుడు వృద్ధుడయిన హగ్గయి, యౌవనస్తుడయిన జకర్యా వారిని ఎంతో ప్రోత్సాహించి దేవాలయపు పని జరుగునట్లు చేసిరి. ఆత్మీయ రీత్యా జకర్యా ఎంతో బలమైన వాడు, ప్రభుని మీద పూర్తి భారము వేసి ధైర్యముగా వున్నవాడు. జకర్యా కుమ్మరి ఇంటకి తీసుకొని వెళ్ళబడెను.

అందుకు జాన్, నా దగ్గర కృప లేదు కదా, నేను బోధించుట మాని వేసేదనా అని మొరావియన్ నాయకునని అడిగెను. అందుకు అతను నీవు తప్పకుండ బోధించుము. ఎందుకనగా కృప గురించి బైబిలు గ్రంధములో వున్నది. నీవు కృపను పొందినపుడు కృపను గురించి బోధించుము. కృపను పొందక ముందు కూడ కృపను గురించి బోధించుము. ఎందుకంటె కృపను గురించి వాక్యంలో ఉన్నది గనుక అని చెప్పెను.

క్రొత్త నిబంధన గ్రంధములో పౌలు కంటె స్థిరమైన నమ్మకము కలవాడు ఎవరూ లేరు. శారీరకంగా ఎంతో బాధననుభవిస్తూ కూడ పౌలు తాను చేయు దేవుని సేవను ఒక్క రోజు కూడ ఆపలేదు. నేనయితే పౌలు భరించినటువంట శారీరక బాధను ఒక్క రోజు కూడ భరించలేను. ప్రభువు పౌలును కుమ్మరి ఇంటికి తీసుకొని వెళ్ళేడు.

యోషయాని చూసినట్లయితే హోషేయ చనిపోయినప్పుడు అందరు దేవుని విడచి నిరాశ పడినప్పుడు, యెషయ దేవుడు సింహాసనం మీద కూర్చుండుట చూశాడు. వారు- యిర్మీయా, జకర్యా పౌలు ధైర్యము,మనోబలము, సంకల్పబలం, నమ్మకము, పట్టు వదలనని ధృడత్వం సరిఅయినదిశ గలవారు. వారు ఎంతో చాకచక్యము నైపుణ్యము కలవారు. వారు ఎక్కడకు వెళ్ళినను విజయులుగా వుండగలరు. అట్టి వారిని దేవుడు ఏర్పరుచుకొనెను. వారిని దేవుడు పూర్తిగా ఉపయోగించక ముందు వారు కుమ్మరి ఇంటి పాఠములు నేర్చుకోవలసి వున్నది.

దేవుడు ఏర్పరచు కొనిన బిడ్డలు ఆయన ముఖ్య సూత్రాన్ని తెలుసుకోవాలి. మనం ఒకొక్కసారి మన స్వంతయిష్టాలు దేవుని చిత్తంగా భావిస్తూ వుంటాము. దేవుడు ఆయన చిత్తాన్ని మనకి అనుగుణంగా కొంతయినా మార్చుకోవాలని మనం ఆశిస్తూ వుంటాము.

కుమ్మరి ఇల్లు ఏ దేశంలో వున్నా, ఏ ఖండంలో వున్నా అన్ని చోట్ల ఒకే విధంగా వుంటుంది. అక్కడ ఒక కుమ్మరి, ఒక చక్రం, జిగట మన్ను వుంటాయి.జిగట మన్ను ఏ రంగులోనైనా ఎలాగైనా వుండవచ్చు. కాని కుమ్మరికి కావలసినవి జిగట మన్ను, చక్రం మాత్రమే. ఇక్కడ మనకి కనిపించే ముఖ్యమైన విషయం ఏంటంటే జిగటమట్టికి తన మీద తనకి ఎటువంటి అధికారం, హక్కులు లేవని,. కుమ్మరి ఎలా తయారు చేస్తే అలా తయారు అవ్వాల్సిందే. దేవుడే మనల్ని తయారు చేసే కుమ్మరి. ఆయన తనకి ఇష్టమయిన రీతిలో మనల్ని తయారు చేసుకుంటాడు. ఆయనకు మన మీద సర్వాధికారాలు వున్నవి. మనం ఆయన చేతిలో జిగట మట్టిలాంటి వారము.

కుమ్మరితో జిగట మన్ను "నీవు ఏమిచేయుచున్నావు? నన్ను ఎలా తయారు చేస్తున్నావు? నీవు చేసేది నాకు నచ్చుటం లేద, నీవు చక్రం త్రిప్పటం, జిగట మన్ను కలపటం ఆపి కాసేపు నాతో మాట్లాడు. నన్ను ఎలా చేయబోతున్నావో చెప్పు. ఎందుకంటే నీవు ఇచ్చే ఆకారం నాకు నచ్చక పోవచ్చు" అని చెప్పగలదా? చెప్పలేదు. ఎందుకంటే కుమ్మరికి తాను చేసే పాత్ర మీద సంపూర్ణ అధికారం వున్నది. యెషయా లో " జిగట మన్ను దానిని రూపించు వానితో నీవేమి చేయుచున్నావని అనదగునా"? అనే వాక్యం మనం చూస్తు న్నాము. ప్రభువునకు మన మీద సర్వాధికారాలు వున్నవి.మనం ఆయన చేతిలోని పాత్రలము. నేను ప్రతిదానిని పాపం అని అనటం వింటూ వుంటాను. ఒకసారి ఒక పెంతుకోస్తు గుడికి మానాన్న గారు ప్రసంగించటానికి వెళ్ళేరు. అక్కడి ఉన్నటు వంటి వారు కట్టుకున్న టై తీస్తేనే మీరు పరిశు ద్ధాత్మతో నింపబడతారని మా నాన్నగారికి చెప్పేరు. ఈ పాపం అనేదాని మూలం ఒకటే. మనం దారితప్పిన గొఱ్ఱెల వంటి వారము. మిగతా గొఱ్ఱెలను కూడ మన దారిలో పడిచేటట్లు చేస్తాము. మీరు అనుకోవచ్చు. నేను చర్చిలో వున్నాను.

దేవునితో నాకు అనుభవం ఉన్నది కనుక ఈ పాపం నీలో నుండి త్వరగా పోతుంది అని ఈ గుడిలో ఉన్నా ఎంతో మంది వారిష్ట ప్రకారంగా జీవించటానికి ఇష్టపడతారు. వారు మిగతా పాపుల కంటే అధ్వాన్నస్థితిలో వున్నారు. ఎందుకంటే వారు వారి ప్రవర్తనను సమర్ధించే వాక్యాల కోసం పరిశుద్ధ గ్రంధంలో వెతుకుతూ వుంటారు. అవిధేయులుగా జీవించటం దేవునికి అంగీకారం కాదు మనం చేయకూడనిది చేయటానికి ఎదురు తిరుగుతున్నాము. ఒక మచ్చిక చేయని కళ్ళెం లేని గుఱ్ఱం ఏ విధంగా మన మాట వినదో అదే విధంగా మనం ఎన్నో సార్లు దేవునికి అవిదేయులుగా వుంటున్నాము. నాకు ఒక సారి అటువంటి గుఱ్ఱంతో అనుభవం ఎదురయింది. నాకు తమ్ముడు వరస అయ్యే వానికి ఒక మంచి రేసు గుఱ్ఱం వున్నది. నా తమ్ముడు దానికి మంచి తర్ఫీదు ఇచ్చి వున్నారు. అది ఎన్నో పందేలలో పాల్గొని గెలిచింది. గుఱ్ఱం మీద కూర్చున్నప్పుడు మోకాళ్ళతో దానిని ప్రక్కలలో వత్తాలి.అప్పుడు అది పరిగెడుతుందని చెప్పేరు. నేను అదే విధంగా చేశాను. గుఱ్ఱం పరుగెత్తుకొని వెళ్ళింది. నేను క్రింద పడ్డాను. ఎందుకంటే దానిని అదుపులో పెట్టే కళ్ళెం దాని నోట్లో లేదు. కళ్ళెం లేక పోవటం మూలాన గుఱ్ఱంచెప్పిన మాట వినలేదు.

కుమ్మరి ఏ విధంగా ఒక ఉద్దేశంతో ఒక ఆలోచనతో తాను చేయదలచిన పాత్రను చేస్తాడో దేవునికి కూడ మనిషిని సృజించటంలో ఒక ఉద్దేశం ఉన్నది. దేవుడు "మన స్వరూపమందు మన పోలిక చొప్పున నరులను చేయుదము" అనుకొని నరులను సృజించెను. దేవుడు ఎంతో మహిమాపరాక్రమములు గలవాడు. శక్తిమంతుడు. ఆయనకు మనతో ప్రేమగా, మంచిగా వుండవలసిన అవసరంలేదు. ప్రతిసారి ఆయన ప్రేమ గలవాడని, నమ్మదగిన వాడని మనకి చూపిస్తున్నాడు. ఆయన కు మన మీద ఆగ్రహించటానికి స్వతంత్రం ఉన్నది. కాని ఆయన ఆ స్వతంత్రాన్ని ఉపపయోగించటం లేదు. కాని మానవులమయిన మనం మనకిచ్చినటువంటి స్వతంత్రాన్ని దుర్విని యోగం చేస్తున్నాము. చేస్తూనే వున్నాము.దేవునితో మన తిరుగుబాటు ఒక చీమ రైలుకి ఎదురు తిరిగి మాట్లాడినంత తెలివి తక్కువగా ఉంటుంది.. దేవుడు మనం కూడ ఆయన ప్రియ కుమారుని వలె వుండాలని కోరుకొంటాడు. ఆయన మన హృదయం చూసే దేవుడు. నేను నా ఇష్టాను సారంగా వుంటానంటమే పాపం. ఎందుకంటే మనం ఆయన ఇష్టానుసారంగా జీవించాలి. కుమ్మరిఇష్ట ప్రకారమె పాత్ర వుంటుంది. కుమ్మరి ఇల్లు ఆయన(దేవుని) గృహము.

కుమ్మరి చేతిలో జిగటమన్ను తిరుగుబాటు చేయలేదు. ఆయన చేసినట్లు ఉండాలి. సర్వాధికారాలు ఆయనవే. ఆయనే మన అధికారి. ఆయనే దేవుడు. ఇది ముఖ్యమైన "ప్రిన్స్‌పుల్".

రెండవ మాట దేవుడు మానవునని సృజించినప్పుడు "మన స్వరూపమందు మన పోలిక చొప్పున నరులను చేయుదము" అని అనుకొనెను. దేవుడు ఒక వంట వాడు కాదు వెయిటర్ కాదు, బ్యాంకర్ కాదు. ఆయన ఒక ప్రత్యేకమైన ఉద్దేశం వున్నా కుమ్మరి. దేవుడు మనిషిని తన స్వరూపంలో చేసినప్పుడు అతనితో కలసి నడచి, మాట్లాడివున్నాడు. మానవుడు తప్పు చేయకుండా వుండి వున్నట్లయితే దేవునితో పాటు కలిసి జీవిస్తూ వుండే వాళ్ళం. మన అవిధేయతతో ఆ అవకాశం పోగొట్టు కొన్నాము. పాపము వలన వచ్చు జీతం మరణమని వాక్యములో వున్నది.

మన పాపములు దేవునికి మనకి అడ్డుగా వచ్చి యున్నది. ఎఫెసీయులకు వ్రాసిన పత్రికలో దేవునికిని మనకి మధ్య అడ్డుగోడ వున్నదని, దేవుడు ఆయన కుమారుని మనకిచ్చి ఆ అడ్డు తొలగించి యున్నాడని చదువుకొన్నాము. అడ్డుగోడ తొలుగుట ద్వారా దేవుని ఆత్మ మనలో వచ్చినివసించి, మనం ఆయన బిడ్డలము అయ్యాము. ఈ మట్టి పాత్ర అపురూపపమయిన ఐశ్వర్యముతో నింపబడిన పాత్రగా అయింది.

ఐననూ మనలోని ఆ పాత వ్యక్తి ఆ నల్లని భయంకరమైన కాకి వంటి వాడు పోయాడా? పోలేదు. అతనింకా మనలో ఉన్నాడు. అందుకే పౌలు మనం అనుదినం ఆ పాత వ్యక్తిని సిలువ వేయాలని చెప్పాడు. దేవుడు నాలోనికి వచ్చాడు, ఆయనకు నాతో పని అయిపోయింది అని మనం ఇష్టప్రకారం జీవించకూడదు. దేవునని ఆత్మను తమలో నివసింప చేసుకొన్నా వారిని ఆయన " కొందరిని అపోస్తులుగాను పిమ్మట కొందరిని అద్భుతములు చేయువారిని గాను, తరువాత కొందరిని స్వస్థపరచు కృపావరములు గల వారిగాను, కొందరిని ఉపకారములు చేయు వారిగాను, కొందరిని ప్రభుత్వములు చేయువారిగాను కొందరిని నియమించెను"అను వాక్యములను పౌలు కొరింధీయులకు వ్రాసిన పత్రికలో మనకి తెలియజేశాడు.

'ఆది యందు వాక్య ముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెన, వాక్యము మనుష్యరూపము ధరించుకొని మన మధ్య నుండెను".. మనం యోహాను 1:18 లో గమనించినట్లయితే "ఎవడును ఎప్పుడయినను దేవుని చూడలేదు , తండ్రి రొమ్మునున్నా అద్వితీయ కుమారుడే ఆయనను బయలుపరచెను". ఎవడును దేవుని చూడలేదు. తెరవెనుక నుండి క్రీస్తు ఆయనను ముందుకు తీసుకొని వచ్చి దేవుడు ఎలా వుంటాడో మనకు చూపించాడు. దేవుని ఉద్దేశం అటువంటిది ఆయన తత్వము ఎన్నడూ మారలేదు. యేసును ఒక నమూనగ, ఒక అచ్చుగా మనకి ఇచ్చాడు. ఆయన బిడ్డలు అందరు ఆ అచ్చులోని కొలతల ప్రకారం రావలసిందే. క్రీస్తు మనకు మార్గ దర్శకునిగా ఇవ్వబడ్డాడు. క్రీస్తు లాగ ఉండుట అనే అంశం మీద నేను రెండు గంటలు అనర్గళంగా మాట్లాడగలను. ఇక్కడ ఎన్నోసార్లు ఆ విషయం మీద రెండు గంటలు కంటే ఎక్కువ మాటలాడినాను. క్రీస్తులాగ వుండటం మొదలు నుండి ప్రారంభం అవాలి. యేసు జీవిత చరిత్రని మీరు సువార్తలలో మొదటి నుండి చివర వరకు చదివినప్పుడు మీకు ఒక విషయం అర్థం అవుతుంది. ఆయన జీవించుటకు ముఖ్య కారణం, ఒకే కారణం తనను పంపిన తండ్రి చిత్తాన్ని నెరవేర్చడమే అని, దానికి అడ్డు వచ్చిన ప్రతి దానిని ఆయన త్రోసి వేశాడు. భూలోక సంబంధమైన బంధుత్వాలకు బంధాలకు ఆయన ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వలేదు. యెరూషలేము దేవాలయములో ఉన్నా బాలయేసుని వద్దకు ఆయన తల్లి వచ్చి "ఇదిగో నీ తండ్రియు నేనును నిన్ను వెదకు చుంటిమని ఆయనతో చెప్పగా, ఆయన మీరేల నన్ను వెదకుచున్నారు? నేను నా తండ్రి పనుల మీద ఉండవలెనని మీరు ఎరుగరా?" అని వారితో చె ప్పెను. మరియొక సందర్భములో 'నన్ను పంపిన తండ్రి చిత్తప్రకారం చేయు వారే నాబంధువులు' అని యేసు తన తల్లితో చెప్పిన ప్పుడు ఆమె ఎంతో బాధపడి వుండవచ్చును.

నేను 'తండ్రి సాధ్యమయితే ఈ గిన్నె నా దగ్గర నుండి తొలగించమని' నా జీవితంలో కొన్ని వేల సార్లు ప్రార్థించాను. గత మూడు రోజులు నుండి మరి ఎక్కువ సార్లు ప్రార్థిస్తున్నాను. ఎందుకంటే నాకు ఇంకా చాలా అవసరములు వున్నవి. దేవుని బలవంతం చేస్తే ఆయన వాటిని ఇస్తాడేమోనని అనుకొన్నాను. కాని ఇప్పుడు పూర్తిగా నన్ను నేను సమర్పించుకోవాలి అని తెలుసు కొన్నాను. పూర్తిగా ఆయన చేతికి వదిలి వేయాలని తెలిసి కొన్నాను. పగ్గాలు కొద్దిగా నా చేతిలో వుంచు కొంటే కొంత దేవుని చిత్తం, కొంత నాయిష్టంలాగ వుంటుంది. అప్పుడు దేవుని చిత్తం నా విషయంలో నెరవేరదు. మన భారం పూర్తిగా ఆయన మీద ఉంచాలి.

యేసు ప్రభువునకు నాకు, మీకు ఉన్నటువంటి చంచల స్వభావము లేదు. ఆయన చెమటలు కార్చి 'తండ్రి నీ చిత్తమయితే ఈ గిన్నె తొలగించమని ప్రార్ధించాడు' శిలువ గరించి మనం మంచి శుక్రవారం రోజున మాట్లాడుకొన్నాము. మంచి శుక్రవారమును, మంచి శుక్రవారం అని కాకుండా ఆ రోజు చెడ్డ శుక్రవారం అని పిలువబడాలి. మనం ఆయన ఎదుర్కొనిన పరిస్థితులను పూర్తిగా గ్రహింప లేక పోవుచున్నాము. హెబ్రీయులకు వ్రాసిన పత్రికలో చెప్పినట్లు, శూన్యం నుండి ఈ సృష్టిని మాటతో సృజించిన దేవుడు అవమానింపబడి, హేళన చేయబడి "తండ్రి వీరేమి చేయుచున్నారో వీరెరుగరు కనుక వీరిని క్షమించమని' ప్రార్ధించిడు. మీ కోసం, నాకోసం మహిమ గల రాజు ఆ రోజు చనిపోయాడు. కాని గెత్సెమెనె లో ప్రార్ధన చేసినప్పుడు, ఆయన మనవలె శరీర సంబంధియై వున్నాడు ఆయన 'నాఇష్టము కాదు తండ్రి నీచిత్తము' అని ప్రార్ధన చేయగా ఆయన చెమట, నేల పడుచుండు గొప్ప రక్త బిందువులవలె ఆయెను.యేసు ప్రభువు, తండ్రి నా ఇష్టము కాదు నీ చిత్తము అని చెప్పెను.

ఆయన ముఖ్య సూత్రము మారబోదు. ఆయన ఏ విషయంలోను రాజీపడడు, ఏ విషయంలోను సర్దుబాటు చేసుకొనడు. ఆయనకు కావలపినది ఒకటే తిరిగి ఎదురు జవాబు చెప్పని జిగట మంటి వంటి వారు. ఆయనకు అన్ని హక్కులు ఉన్నవి. అక్కడ ఎటువంటి బేరసారాలు లేవు, సర్దుబాట్లు వుండవు. ఆయన ముందే తన ప్రణాళిక చెప్పేడు దానిలో మార్పులు ఉండవు. ఆయనకు మన లాంటి వారుకాదు. చిన్న క్రీస్తులాంటి వారు కావాలి. మీ వైవాహిక జీవితం, మీ ఉద్యోగం, మీ కుటుంబం ప్రతిదీ దేవుని చేతిపనే, వాటన్నిటిలో దేవుడు మీతో ఉన్నాడు. ఆయన ముఖ్యంగా మన దగ్గర ఆశించేది మన జీవితంలో ఎదురయ్యే ప్రతి పరిస్థితిలో, ప్రతి సంఘటనలో ఆయన ను ప్రతిబింబించేటట్లు వుండాలి.

ఇక మూడవ మాట పద్ధతి, నేను దేవుని నా అధికారిగా పూర్తిగా అంగీకరించినట్లయితే ఆయన నన్ను క్రీస్తువంటి వానిగా చేస్తాడని నమ్ముతున్నాను. ఆయన నన్ను పట్టుకొని, గిర్రున తిరిగే ఆ పరిస్థితులు ఆ చక్రం మీద వేసినప్పుడు, అది తిరుగుతూ, నన్ను త్రిప్పుతూ, వంచుతూ, నన్ను ఆకారం లేకుడ చేస్తున్నప్పుడు నేను కుమ్మరి చేతిలోని జిగటమంటి వలె ఆయనకు ఎదురు తిరగ కూడదు. నేను కుమ్మరికి నా మీద సర్వాధికారాలు వున్నవని, నామీద పూర్తి హక్కు వుందని మర్చిపోయి, వేగం బాగుండ లేదు, కోణం బాగుండలేదు, ఆకారం బాగా లేదు అని సణుగుచున్నాను. చక్రం అంటే మనం ఎదుర్కొనే పరిస్థితులే. నేను ఈ చివరి దినాల్లో పడుతున్నా బాధలో దేవుడు ప్రవేసించి అది ఆయనకు ఉపయోగకరంగా వుండేటట్లు చేస్తున్నాడని నమ్ముతున్నాను. రోమా . 8.లో' దేవుని ప్రేమించిన వారికి ఆయన సంకల్పము చొప్పున, పిలువబడిన వారికి సమస్తమము సమకూడి జరుగుచున్నవి', అని వున్నది. ఆయన నా మీద పని చేయవలెనంటే నన్ను ఏ స్థితిలో, ఏ ఆకారంలో ఉంచాలో తెలుసు. కొంత మంది ఉదయం నుండి సాయంత్రం వరకు దేవుని చిత్తం ఏమై వుంటుందని భయపడుతూ వుంటారు. మీకు ఆ విషయంలో ఖచ్చితమైన అభిప్రాయం లేకుంటే దేవుని నడిపింపు కోసం వేచి వుండండి. మంచి మనిషి వేసే ప్రతి అడుగు దేవుని శలవుతో నే వేయబడుతుందని వాక్యం చెబుతుంది. మనం ఆయన ఆజ్ఞలు పాటించితె ఆయన మనకు త్రోవ చూపుతాడు. ఆయన కౄరమైన మనస్సు కలవాడు కాడు. మనం బాధపడుతుంటే చూసి ఆనందించేవాడు కాదు. మనం తప్పి పోయిన గొఱ్ఱెలవలె వుండటానికి ఆయన తన కుమారుని మన దగ్గర కు పంపలేదు.

మీరు. నేను మన జీవితాలను ఆయన  చేతిలో పెడితే ఆయన మనల్ని నడిపిస్తాడు. మనతో వచ్చిన చిక్కేంటంటే, మనం ఆయన దగ్గరకు వెళ్ళినప్పుడు మనకి అగస్మాత్తుగా మనం వెళ్తున్నాదారి నచ్చకపాయినా, మన అడుగులు తడబడి పొరపాటు, జరిగినా, ఆయన చేయి వచ్చి సరిచేయ బోతే మనకి నచ్చదు.  పరిస్థితులు చక్రం వంటివి. కుమ్మరివాని చేయివలె దేవుడు మన పరిస్థితుల  చక్రంలో ప్రవేసించి ప్రతిది సరి చేస్తాడు.  పేతురు మనకి బోధించినది  ఇదే పేతురు కుమ్మరివాని గృహం గురించి చెప్పలేదు కానీ, ఆశియా లోని చెదరిపోయిన క్రైస్తవులకు ఆయన చెప్పింది  ఆదే , దేవునికి మనల్ని ఎలా  వంచితే ఒక ఆకారం లోకి వస్తామొ తెలుసు. కుమ్మరికి ఎంత వేగంగా చక్రం త్రిప్పాలో ఏ కోణంలో  త్రిప్పాలో, జిగట మట్టిని  ఏ స్థలంలో చక్రం మీద పెట్టాలో తెలుసు. చేతులు ఎక్కడ పెట్టి ఆ జిగట మంటికి చక్కని రూపు ఇవ్వాలో తెలుసు. నేను కుమ్మరి  చేస్తున్నప్పుడు వెళ్ళి గమనించేవాడిని. మనసు ప్రక్కకు మళ్ళకుండా తనదృష్టి, మనసు పూర్తిగా  కేంద్రీకరించి చక్రం వేగం పెంచుతూ,

తగ్గిస్తూ ఆజిగట మన్నుతో పనిచేసేవాడు. .చెదరిపోయిన క్రైస్తవులకి  పేతురు చెప్పినది ఇదే. మీరు ప్రార్ధన చేస్తే, ఆ బోధకుని దగ్గరకు వెళ్ళి బోధలు వింటే లేకుంటే ఫలానా పుస్తకం చదివితే మీరు పడేబాధలు తగ్గుతవి అని చెప్పలేదు.దేవుని స్తుతించండి. విశ్వాసం బలపడే పరిస్థితి వస్తే గాని మీకు ఎంత విశ్వాసం వున్నాదో తెలియదు.మీకు నలుప్రక్కల నుండి వత్తిడి కలిగినపుడు మీ విశ్వాసం పరీక్షకు నిలబడినపుడు మీకు ఎంత విశ్వాసం ఉన్నదో మీకు తెలుస్తుంది.మనం ఆ విశ్వాస పరిక్ష ఎదుర్కొంటేగాని మన విశ్వాసం మనకి తెలియదు. నీకు ఎంతో కోపం కలిగించే పరిస్థితులు వస్తేనే నీకు ఎంత కోపం  రాగలదో నీకు తెలుస్తుంది. అప్పుడు అటువంటి  పరిస్థితిని ఏవిధంగా ఎదుర్కొవాలో తెలుసు కొంటావు.

నిన్ను తయారు చేసే చేయివైపే చూడు, నీవు అనుభవించే వత్తిడి,  నీబరువు,  భారాల నుండి  నీ మనసు మళ్ళించు పోరాడటం ఆపి జిగటమంటి ముద్ద వలె ఆయన చేతిలో వదిగిపో, నీవు ఆయనను తన పని చేసుకోనివ్వు.
చివరగా నేను' ఉద్దేశం, పద్ధతి' అనే మాటల గురించి క్రొత్త నిబంధన నుండి చెబుతాను ఇది ఏ విధంగా చెప్పాలోనాకు తెలియటం లేదు. నేను ఒక కుమ్మరి వద్దకు వెళ్ళి అతని పనిని గమనించాను నేను చూసినటువంటి ఏ పని కూడా అంత ఏకాగ్రతతో దృష్టి మరల్చకుండా చేయబడటం నేను చూడలేదు. చివరకుఒక గొప్ప కళాకారుడు కూడా అంత ఏకాగ్రతతో చేయలేడు. కుమ్మరి తనుచేసే ప్రతి ఒక్క  పాత్రను ఎంతో ఏకాగ్రతతోజాగ్రత్తగా చేస్తాడు.  యేసు ప్రభువు.' నీ తల వెంట్రుకలు లెక్కింపబడినవి' అని అన్నాడు. మీలో ఎవరైన విరిగి, ఆకారం కోల్పోయిన పాత్రలాగ వుంటే,వారు దేవుని చేతిలో సరిచేయబడతారనే ఆశ వున్నది, అవకాశ వున్నది. దేవునికి ఆశక్తి వున్నది. వుండటమే కాదు ఆయన , కుమ్మరి ఏ విధంగా ఒకొక్క పాత్రను ఏకాగ్రతతో దీక్షతో సరిచేసేడో అదే విధంగా ప్రభవు మనల్ని తయారు చేస్తాడు. నేను  ఆయన చేతుల్లో వున్నాను. మీరూ  ఆయన చేతుల్లో వున్నారు. ఈ కీర్తన నేను ఒక వెయ్యిసార్లు చెప్పేను.

ఇది నావిషయంలో , మీ విషయంలో నిజమైనది. " నేను కూర్చుండుట నేను లేచుట నీకు తెలియును. నాకు తలంపు పుట్టకమునుపే నివు నా మనస్సు గ్రహించుచున్నావు."  నేను మాటలలో చెప్పక ముందే మీకు అర్థం అయి వుంటుంది. " నేను వేకువ జామున రెక్కలు కట్టుకొని , సముద్ర దిగంతములలో నివసించినను  అక్కడ నీ చేయి నన్ను నడిపించును". " నేను పాతాళ మందు పండు కొనినను నీవు అక్కడను  ఉన్నావు". అంధకారము నన్ను మరుగుచేయును. నాకు కలుగు వెలుగు రాత్రివలె వుండును". నేను నా అనుభవాల ద్వార నేర్చుకొంటున్నప్పటికీ, బోధింప బడిన వాక్యం నిజమైనది. దేవుడు మీకు వెలుగులో చెప్పినది మన కష్ట సమయాలలో మర్చిపోకూడదు. మనం భరించలేనంతగా మనకి శోధనలు ఇవ్వడు. ప్రతి శోధనకి ఒక తప్పించుకొనే మార్గం వుంటుంది. తప్పించుకొవటానికి తాళం తయారు చేసి ఆయన తలుపుకు పెట్టేడు. ఆయన నిన్ను, నన్ను చక్రం మీద తీస్తున్నప్పుడే, ఆయన దగ్గర జవాబు వున్నది.

మీ సమస్య ఏంటో నాకు తెలియదు, కాని నా సమస్య నాకు తెలుసు. నా జవాబులు నాకు తెలుసు, కాని ఆయన నన్ను చక్రం మీద త్రిప్పుతున్నప్పుడు ఆయన చిత్తం అనే పరిస్థితికి వచ్చాను. ఆయన చేతులు నా మీద పని చేస్తున్నవి. ఆయన చిత్తం.

ముగించే ముందు వ్యక్తి అనేమాట గురించి చెబుతాను పాత నిబంధనలో కుమ్మరి వాని గృహము కష్టతరమైనది. కుమ్మరికి తగినట్లుగా పాత్ర రాకుంటే అది కుమ్మరి పొలములో పారవేయబడును.ఇక దాని స్థలము అదే.

యూదా యేసు ప్రభవుని అప్పగించటానికి వచ్చినప్పుడు ఆయన యూదాని 'చెలికాడా' అని పిలుస్తాడు. అది నాకు ఎంతో ఆశ్చర్యంగా వుంటుంది. తనని మరణానికి అప్పగించే వ్యక్తిని ఎలా 'చెలికాడా' అనిఎలా పిలువ గలిగేడని యూదాకి తను చేసిన స్వామి ద్రోహం , తను మూలంగా జరిగిన అనర్ధం అర్ధం అయినప్పుడు, అతడు పశ్చాతాప పడి, తాను తీసుకొన్న ముప్పది వెండి నాణాలను ప్రధాన యాజకుల వద్దకు తీసుకొని వెళ్తాడు. ఆ ముప్పది వెండినాణాలు ప్రభుని ప్రాణానికి వారు కట్టిన విలువ వారు ఆ వెండి నాణాలు తిరిగి తీసుకొనుటకు నిరాకరించినందున, వాటిని అక్కడ పారవేసి, పోయి ఉరిపెట్టుకొని మరణిస్తాడు. వారు " ఇవి రక్త క్రయధనము గనుక వీటిని కానుక పెట్టెలో వేయతగదని చెప్పుకొనిరి. కాబట్టి వారు ఆలోచన చేసి వాటినిచ్చి, పరదేశులను పాతి పెట్టుటకు కుమ్మరి వాని పొలము కొనిరి". ఇది ఏదో అనుకోని రీతిగా జరిగిన సంఘటన కాదు. దేవుడు మానవుల విమోచన కొరకు, క్రయ ధనంగా చెల్లించబడిన సొమ్ముతో పనికి రాని కుండపెంకులు పారవేసే కుమ్మరి వానని పొలం కొనే పరిస్థితులు కలుగచేశాడు. పగిలి , పాడయి, ఆకృతి కోల్పోయిన ఆ పాత్రలు మన అపజయ జీవితానికి, దేవునితో సరిగా లేనటువంటి మనకు గుర్తు.

యేసు జీవితం మనకి మరలా ఇంకొక అవకాశం వున్నదని తెలుపుతుంది. పాత నిబంధనలో మనకి ఆ అవకాశం లేదు. ప్రభువు తన రక్త క్రయధనంతో కుమ్మరి పొలం మొత్తం కొన్నాడు.మత్తయి 13 లో దేవుడు పొలంలో గల నిధికొరకు పొలమంతటికి ధర చెల్లించి కొన్నట్లు వున్నది. గత సంవత్సరాలలో దేవుడు నాకు నేర్పించి, నడిపించిన రీతిని నేను గుర్తు చేసుకొంటే, నేను దేవునికి తగినవాడను కానని పిస్తుంది. నేను దేవునికి తగినవాడను కానని భావమే నేనింత కష్టపడి దైవ సేవ చేయటానికి కారణం అయింది. కాని నాకు ఒక విషయం బాగ అర్ధమయింది. దేవునికి విరిగిన పాత్రలు అలవాటేనని దేవుడు విరిగి ముక్కలయిన పాత్రలున్న పొలాన్ని కొన్నాడు. విరిగిన పాత్రల వంటి మీరు తిరిగి బాగుచేయబడటానికి ఆయన దగ్గరకు రావచ్చు. కాని ఒక సంగతి గుర్తుంచుకొనండి. ఇదివరకటి షరతులు మారలేదు. ఇప్పుడు కూడా ఆయనే అధికారి. ఆయన ఉద్దేశ ప్రకారమె చేస్తాడు. ఆయన చేయాలనుకొన్నా పద్ధతి ప్రకారమె చేస్తాడు. అది మారలేదు ఆయన చేసే పద్దతిలో మనకి బాధ కలుగుతుంది. కాని దేవునికి స్తోత్రం మనకి నూతనంగా జీవించకలిగే మరొక అవకాశం దొరికింది. ఈ ప్రసంగం వింటున్నా ఇక్కడ వున్నా ప్రతి విరిగిన పాత్ర ఆయన మీ మీద పనిచేయుటకు అంగీకరిస్తే ఆయన మీ మీద పని మొదలు పెడ్తాడు.

దేవుడు మీ పాస్టర్ గారి మీద ఇంకా పనిచేస్తున్నాడు. నాకు ప్రసంగించుట కంటే ప్రార్ధించుట సులువుగా వున్నది. కాని దేవుడు ఈ రోజు నేను ఈ ప్రసంగాన్ని ఇక్కడే ప్రసంగించేటట్లు ఎందుకు చేశాడంటే ఇక్కడ కొన్ని విరిగిన పాత్రలు ఇంకా చక్రానికి ఎదురు తిరుగుతున్నవి, సరిచేయబడవలసిన కొన్ని వంకర పాత్రలు వాటి అధికారి ఎవరో తెలునుకోవలసి వున్నది. వాటి బాస్‌ని గుర్తించి ఆయన అధికారానికి లోబడవలసి వున్నది. ఆయన పద్ధతికి అనుగుణంగ పోవలసి ఉన్నది.

ఈ వారం టెలివిజన్ లో నేను చార్లెస్ .జి.ఫిన్నిగారు చెప్పిన మాట చెప్పేను ' దేవుని వాక్యం అనుసరించకుండా బోధించటం తప్పు' . మనం మట్టితో చేయబడిన మనుష్యులం , మనకి ఆశలు , కోరికలు, అవసరాలు వున్నవి. మనం తెలుసుకోవలసిన ముఖ్యమైన విషయం, మనం దేవుడు ఆయన కిష్టమైన రీతిగా మన జీవితం సరిదిద్దటానికి అంగీకరిస్తున్నామా?

పోయిన ఆదివారం ఈ చర్చి పాస్టర్ నైన నేను, ఈ చర్చి పరిశుద్ధాత్మకు నివాసంగా ఉండాలని కోరుకొన్నాను. నేను ఈ రోజు ఈ పాస్టర్ దగ్గర ఈ చర్చిలో దేవునికి పనికివచ్చె జిగట మన్ను లభ్యమవుతుందని ఆశిస్తున్నాను. . 75 మంది మొరావీయులు ప్రపంచాన్ని ఒక ఊపు ఊపి మెథడిస్ట్ ఉద్యమాన్ని, రక్షణ సైన్యాన్ని తేగలిగినప్పుడు, మనం మనలను దేవునికి పూర్తిగా సమర్పించకొంటే విరిగి పాడయిన పాత్రలయిన మనల్ని బాగుజేసి ఆయన మనతో ఎంత సేవచేయించగలడు?

కాపీ రైట్ © 2007, పాస్టరు మెలీసా స్కాట్ - సర్వహక్కులు మావి
Copyright © 2007, Pastor Melissa Scott - All rights reserved